# తల్లిచాటుం పిల్లవాడుం

## 1

లోకం ఒక పెద్దకొలిమి. అనేక ఢక్కా ముక్కలు తిని రాటుతేలినవాళ్ళు దాని వేడికి తట్టుకోవలిసిందే కాని, ప్రసాదరావుబోటి సుకుమారులు ఆగలేరు. అటువంటివాడు కొన్ని కారణాలవల్ల లోకంవాత పడ్డప్పుడు—

పత్నీ సమేతుడయ్యేవరకూ ప్రసాదరావు తల్లిచాటున పెరిగాడు. లోకాన్ని గురించి అతనికి గ్రంథపరిచయంవల్ల కలిగిన జ్ఞానమేకాని ప్రత్యక్షానుభవం సున్నా. సుకుమారి. మనసుకూడా అటువంటిదే. ఎక్కువకాలం తన భావ ప్రపంచంలోనే ఉంటూండేవాడు. ఆదర్శాలు గొప్పవి.

ఒక కొమ్మనువదిలి మరోకొమ్మను పట్టుకోవాలనే తెంపెన్నీ కోతులకేకాక. మనుష్యులకూ కూడా ఉంటుంది. భార్య తనదయేరోజు సమీపిస్తున్నకొద్దీ అతను తన భావప్రపంచంలోనించి క్రమక్రమంగా తల్లిని తీసేసి ఆ స్థానం భార్యకివ్వటం మొదలు పెట్టాడు. అందులో తప్పేమీలేదు—తల్లి అసూయాగ్రస్తురాలు కాకుండా ఉంటే. వెంకాయమ్మగారు సంతోషించింది.

ప్రసాదరావెంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది గృహస్థాశ్రమంలో ప్రవేశించబొయ్యేనాడు తన భార్య ఈ విధంగా మాట్లాడుతుంది ఈ విధంగా ప్రవర్తిస్తుంది అని నూరురకాలుగా ఊహించు కోనివ్వండి కాక, తీరా దగ్గిరకొచ్చేటప్పటికి నూట ఒకటోరకంగా ఉంటుంది. ప్రసాదరావుసంగతి పెంపుడు పిల్లికి తిండి పెటుతూండగా అదికాస్త చెయ్యిపీకిన వాడి సామెతయింది! మర్నాడతని మొహాన కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు. అతనదివరకు రకరకాల ప్రణయ కథలు చదివాడు, అనేకమంది స్త్రీలను గురించి విన్నాడు. ఇదే రకమూకాదు. మీదు మిక్కిలి ఆ పిల్లకు సుశీల అని ఎందుకు పేరుపెట్టారో అతనికి అర్థం కాలేదు. గండుపిల్లనికాని కొండముచ్చునికాని నామకరణంచేస్తే ఎంతో సార్థకంగా ఉండేది.

ప్రసాదరావుకు జరిగిన మహా అపకారమేమిటంటే ఆ కిందటి రోజునకూడా అతను భావప్రపంచంలో భార్యతో అద్భుతంగా సుఖపడుతూ చక్కని కలలు కంటున్నాడు. ఇప్పుడా ముచ్చట తీరిపోయింది. భావప్రపంచం పటాపంచలయింది. కలలు వికలమైపోయినై.

రాయటానికీ-చదవటానికీ సుశీల విపరీతమైన వ్యక్తి అనిపించవచ్చును కాని ప్రపంచంలో అటువంటి పిల్లలు లెక్కలేనంతమంది ఉన్నారు పెడకట్టె, మొండిది, మూర్ఖురాలు, ముక్కోపి, నాజూకులేనిది, కట్టెవిరిచినట్టు మాట్లాడేది, మర్యాదతెలీనిది. ఏదైనా లెజిస్లేచరు పెట్టి అటువంటి పిల్లలకు పెళ్ళికాకుండా ఏర్పాటు చేస్తే సంఘం కొంతవరకు తరిస్తుంది.

వెంకాయమ్మగారు కొడుకుదురవస్థ చెప్పినట్టు గ్రహించింది. (తల్లీ పిల్లల మధ్య భాష అవసరంలేదు.) లోపల చింతించి ఊరుకుంది. ఒక్క నెలరోజుల్లో ప్రసాదరావు దేవత్వంనించి దాదాపు రాక్షసత్వాని కొచ్చాడు. ఆవిడ అర్థంచేసుకుని ఊరుకుంది.

వెంకాయమ్మగారికి వంట్లో అస్వస్థతగా ఉండి సుశీల వంటచేసుకోవలిసొచ్చింది. ఆ పిల్ల మొహం మటమటలాడుకుంటూ వంటఇంట్లో చెంబులూ తప్పాలాలు పగలగొడుతుండగా, ప్రసాదరావు గడ్డంచేసుకోటానికి కాసిని నీళ్ళ కోసం లోపలికొచ్చాడు చెంబుపట్టుకుని. అతనింకా అయిదడుగులదూరంలో ఉండగానే సుశీల అతని పని కనుక్కొని సంపించక "అయ్యో! అట్లా మీదికొస్తారేం?" అంది. అతనికి ఒళ్ళుమండి చేతులో ఉన్న చెంబుతో పెళ్ళాం నెత్తిన లాగి ఒకటికొట్టాడు. దాంతో సుశీల కణతలకు పసుపుకొమ్ము అరగదీసి రాచుకుని ఎవరితోనూ చెప్పకుండా గదిలో ముసుగుపెట్టుకుని పడుకుంది. (ఎవరన్నా మాడుమీద ఒక్కటి పెట్టినప్పుడు కణతలకు పసుపు గంధం వెయ్యమని ఏ వైద్యగ్రంథరాజంలోనైనా చెప్పబడుందేమో నాకు తెలీదు. సుశీల ఒక నేటివు డాక్టరుగారి మేనకోడలు కనక ఆమెకే తెలియాలి.) ఒక పొయ్యిమీద అన్నం మాడిపోయింది. రెండో పొయ్యిమీద గిన్నె ఒరిగి పడిపోయింది. అప్పుడు వెంకాయమ్మగారు మడికట్టుకుంటే పటింటికి కావలసిన వంట పన్నెండింటికి తేలింది.

అనాహ్లాదకరమైన ఈ విషయంమీద ఇంతకన్న ఎక్కువ రాయటం తగని పని. నాలుగునెలలు కాపరం సుశీల ఇది గిట్టుపాటుకాని వ్యవహారం అని గ్రహించిందో ఏమో ఎవరితోనూ చెప్పకుండా పుట్టింటికి లేచిపోయింది.

## 2

సుశీల క్షేమంకోరి ఆమెను పుట్టింటినించి తిరిగి అత్తవారింటికి తీసుకొచ్చి రాయబారంచేసే పెద్దలు లేకపోయినారు. కాని మనోవర్తికోసం నోటీసు లిప్పించటానికి కావలసినంతమంది దొరికారు. ఆ విషయమై తగిన ఏర్పాటుచెయ్యటానికి ప్రసాదరావు ఏలూరు వెళ్ళాడు. అత నేవిధమైన పేచీలు పెట్టదలచలేదు. వెళ్ళిన పని వెంటనే అయిపోయింది. తిరిగి రాత్రి బండి అందుకోగలిగాడు. అతను

స్టేషనుకు వచ్చేసరికి బండి కింకా చాలా వ్యవధి ఉంది. అతను స్టేషనులోనే భోజనంచేసి తాంబూలం వేసుకుని పచారు చెయ్యటానికి ప్లాటుఫారంమీద కొచ్చాడు. అక్కడెవరూ లేరు. దూరంగా ఒక స్త్రీ కూర్చునిఉంది. ప్రసాదరావు ఒక్కసారి ముక్కులోనించి చాలా గాలి వదిలాడు. కొంత కాలంనించీ తెల్లబట్ట కట్టుకుని ఆడది కనిపిస్తే అసహ్యం జాస్తయింది. అతను మెల్లిగా ప్లాటుఫారం రెండో చివరకుపోయి అక్కడే తారట్లాడటం మొదలుపెట్టాడు. ఆలోచన ఎటోపోయింది. భావప్రపంచంలోపడి బాహ్య ప్రపంచాన్ని మరిచాడు.

"ఏమండోయి!"

ప్రసాదరావు కొట్టినట్టు ఉలికిపడి తలఎత్తి చూశాడు. పలకరించిన గొంతు కటువుగా ఉండకపోవటమే కాకుండా చాలా శ్రావ్యంగా కూడా ఉండటంవల్ల అతనికి ఉలికిపడవలసిన అగత్యంలేదుకాని, ప్రస్తుతం అతనికీ ఆడగొంతుల మాటరంసు (Sic) బాగాలేదు. ఆ మాటకొస్తే సుశీలదీ కొంతవరకు శ్రావ్యమైన గొంతే.

అతను తన్ను పలకరించిన మనిషివంక చూసి ప్లాటుఫారం మరో చివరకు చూపు సరిపాడు. అక్కడ మనిషిలేదు. ఆ మనిషే ఈ మనిషి. మనిషి కూడా ఎక్కడ! పిల్ల. పదహారేళ్ళు దాటని పిల్ల. బోగంది! రూలు ప్రకారం అతను మళ్ళీ ముక్కులతో బుసకొట్టాడు. తరవాత ఆ పిల్లవంక తీవ్రంగా చూశాడు మెస్మరైజు చేస్తున్నవాడల్లే. కాని అతని వెనక దీపంఉండటంచేత ఆ పిల్ల కదంతా సరిగా కనిపించి ఉండదు.

"నాకు బెజవాడ కొకటిక్కట్టు కొని పెడతారూ?" అన్నదాపిల్ల. ఆ పిల్లమూతి ఎంత అందంగా ఉంది!

"అల్లాగే! డబ్బులు తే!"

ముక్కు? ఏంముక్కు!

"నా దగ్గిరలేవు" అందా పిల్ల.

"నన్ను పెట్టుకోమంటావా?" కళ్ళు?

ఆ పిల్లకు కొద్దిగా కోపంవచ్చినట్టు కనపడ్డది.

"ఉచితంగా ఇవ్వక్కర్లేదు. బదులివ్వండి."

"అవును! తరవాత మనమందరం లెక్కచూసుకునే టప్పుడు—"

ఆ పిల్ల కీసారి బాగా కోపంవచ్చింది.

"అందాకా ఈ ఉంగరం అట్టే పెట్టుకోండి!" అని ఆడపిల్ల వేలిఉంగరం తీసిచ్చింది.

గడ్డం? కనిబొమలు? జుట్టు? వేళ్ళు? అనుకుంటూనే అతను నిర్మోహమాటంగా చెయ్యిచాచి ఉంగరం తీసుకున్నాడు.

"ఈ ఉంగరం ఖరీదెంత ఉంటుంది?" అన్నాడతను ఉంగరం అటూ ఇటూ తిప్పిచూసి.

"డెబ్భై అయిదు."

"బాష్! ఇదేదో ఇమిటేషన్‌రాయి."

"మీరిచ్చేటిక్కట్టు డబ్బులకు సరిపోతుంది లెండి" అన్నదాపిల్ల.

అత నామాట వినిపించుకోకుండా. "ఇదయితే నీ కెట్లా దొరికింది?" అన్నాడు.

ఆ పిల్ల చర్రుమన్నది. "మీకు మర్యాద తెలీదు. ఉంగరం ఇటుతెండి," అన్నది,

ప్రసాదరావు ఇచ్చేశాడు. ఆ పిల్ల తీసుకుని వెళ్ళబోతున్నది.

"ఉండు. నీకిచ్చే రైలు చార్జికి తాకట్టు అవసరంలేదు. టిక్కెట్టు కొని పెడతాను."

అత నీమాట అంటూండగానే పోర్టరు గంటకొట్టి వెళ్ళాడు.

"ఇక్కడే ఉండు, టిక్కెట్లు తెస్తాను."

ఆ పిల్ల అక్కడే ఉంది.

ప్రసాదరావు ఆమెచేతికి టిక్కట్టిచ్చి మళ్ళీ సంభాషణ మొదలు పెట్టాడు.

"నే నిందాక అన్నమాటలు నీకు రుచించినట్టు కనబడదు! మూడు సంగతులు జ్ఞాపకం పెట్టుకో, నేను ఆంటీనాచి, ఆంటీఫెమినైన్. నీ చర్యంతా ఫిషీగా ఉంది."

"అంటే"?

"ఫాల్."

ఆ పిల్ల చిరునవ్వు నవ్వి "నాకంతవరకూ అర్థమౌతుంది."

"నీ కింగ్లీషుకూడా వచ్చునా ఏమిటి ?"

"నేను స్కూలుఫైనల్ పాసయినాను."

"వెరీ గుడ్ ! నీ సంగతంతా ఫిషీగా ఉందని నిరూపిస్తాను చూడు. మీ దేవూపు : నువ్వు బెజవాడ డబ్బు లేకుండా ఎందుకు పోతున్నావు ? నేను బెజవాడ పోతున్నానని నీకెట్లా తెలిసింది ?—"

"నాకు తెలీదు".

"నేను నమ్మను, ఒంటరిగా ఎందుకు పోతున్నావు ?"

"నన్నదంతా అడగకండి ! గాయం కెలికినట్టవుతుంది."

ప్రసాదరావు అకస్మాత్తుగా మాట్లాడటం మానేశాడు.

త్వరలోనే రైలొచ్చింది దాదాపు పెట్టెలన్నీ ఖాళీగానే ఉన్నై. ప్రసాదరావు చిన్నపెట్టెగా చూచి ఎక్కాడు. భోగంపిల్ల కూడా అతని వెనకనే ఎక్కి, "మీకభ్యంతరం లేకపోతే ఇందులోనే కూచ్చుంటాను. చాలామంది మధ్య కూర్చోటానికి నాకు చాలా అసహ్యంగా ఉందిప్పుడు. మనస్సు సరిగాలేదు," అన్నది.

"నా కభ్యంతరంలేదు. ఇందులోకూడా చాలామంది ఎక్కవచ్చుననేది మరచిపోకు."

ఆ పిల్ల నవ్వి "ఎక్కరు" అంది.

ఆ మాట అతనికి దబ్బున అర్థంకాలేదు కాని కాగానే శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది, తన బతుక్కటువంటి పెళ్ళాం కూడానా.

అత నాపిల్లవంక తీక్ష్ణంగా చూశాడు. కాని ఆ చూపు వ్యర్థమయింది. ఆ అమ్మాయి రెండోబల్లమీద కంపార్టుమెంటు అవతలివైపు కిటికీదగ్గర కూర్చుని బయటికి చూస్తున్నది.

ఆ పిల్ల అన్నదే అయింది. ఒకరిద్దరు ఆ పెట్టెలో ఎక్కాలని ప్రయత్నం చేసి ఇద్దర్నీచూచి పక్కకు పోయినారు. రైలు కదిలింది. ఆ పిల్ల బయటికి చూడటం మానేసి అతనివంక చాలాసేపు చూసింది. అత నటువైపు చూడలేదు. చివర కామె లేచి అతనికి దగ్గిరలో కూర్చుని ? "మీ అనుమానాలకు సమాధానం చెబుతాను," అన్నది.

అతను పరధ్యానంగా "ఎందుకు ? నా కవసరంలేదు," అన్నాడు.

"నన్నుగురించి మీరు పరభిప్రాయం పడుతున్నారు. అది నాకిష్టంలేదు."

ప్రసాదరావు కనుబొమలు ముడేశాడు.

"మరభిప్రాయానికి అవకాశంలేదు. నీ అభిప్రాయమేదో స్పష్టంగానే తెలుస్తున్నది."

ఒక్కసారి ఆ పిల్ల మొహం బాధపడుతున్న లక్షణాలు కనబరిచింది.

"మీరు నిజంగా క్రూరమైన మనిషి కారనుకుంటాను ! ఎందుకంత హింసించి నట్టు మాట్లాడుతారు ?"

"క్రూరమైనమనిషి నెందుకౌతాను ? కావాలంటే నా పెళ్లాన్ని అడుగు." అన్నాడతను వికటంగా నవ్వి.

ఆ పిల్ల దీనంగా చూడటం మొదలు పెట్టింది.

"నీ అభిప్రాయాన్ని గురించి నాకెటువంటి అనుమానంలేదు. చూశావు. కుర్రవాడుగా ఉన్నాడు, అమాయకుడేమో బుట్టలో వేద్దామనుకున్నావు. లేకపోతే స్టేషనులో అంతమంది ఉండగా నన్నే ఎందుకు టిక్కట్టు అడిగినావు ? బెజవాడకే ఎందుకు కావాలిసొచ్చింది ? నే ఎక్కిన పెట్టెలోనే ఎందుకెక్కావు ? నువ్వు చెప్పిన సమాధానమేమిటి ఈ పెట్టెలో ఇంకా ఎవరైనా ఎక్కుతారంటే ? ఇంకేమైనా నామీద ఆశలుంటే ఇప్పటికైనా వదులుకో ! నా కర్థంకానిదల్లా ఒకటే ! ఇంత చిన్నదానివి నీ కింత ధైర్యం ఎట్లా వచ్చిందా అని !"

ఆ పిల్ల అతననుకున్నట్టు ప్రవర్తించలేదు. మొహానికి చీర అడ్డం పెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. అంతటితో అతని ధైర్యం యావత్తూ అంతరించింది. పైన ఒక్కపొర ఘనీభవించి చూడటానికతని మనస్సు పాషాణమల్లే ఉందికాని అతని మనస్సులోపల జావగా ఉంది. ఆ పిల్ల ఏడుపు పై పొరను కొట్టేసింది. అతనామెను సమీపించి మెల్లిగా "చూడు" అన్నాడు. ప్రయోజనం లేకపోయింది. ఇంకోసారి కొంచెం గట్టిగా "చూడు !" అన్నాడు. ఉహుం ! అతను బలవంతంగా ఆమె మొహంమీదినించి రెండుచేతులూ తీసేశాడు. ఆ కళ్ళు, మూతి, గడ్డం, ముక్కు అంత సమీపంలో చూసేటప్పటి కతనికి మతిపోయి ఆ దొండపండంటి మూతిని కాస్తా ముద్దు పెట్టుకున్నాడు.

పెద్దమనిషి చెయ్యవలసినపనికాదు. ఆ పిల్ల బోగందయినా, ఆమె అనుమతి లేకుండా, తన్ను నివారించలేని స్థితిలో ఉండగా అటువంటి పని చెయ్యటం చాలా నింద్యమైన సంగతి. ఆ వివేచన అంతా మించిపోయిన తరవాత వచ్చింది. అదే కాదు, ఇంకా చాలావిషయాలు తెలిసొచ్చినై. మొదటిసంగతి అతనంతవరకు ఆ పిల్ల విషయంలో ఒక్కసారైనా పెద్దమనిషి తరహాగా ప్రవర్తించలేదు. మరోసంగతి ఆ పిల్ల చర్య కింకోకారణం ఉండికూడా ఉండవచ్చును. అప్పుడే ఆ పిల్లను

బలాత్కారంగా ముద్దుపెట్టుకున్న మొహంతో ఆలోచిస్తే తన చర్యలో ఆ పిల్ల చర్య నూరోవంతు అనుమానాస్పదంగాలేదు.

ఆ పిల్ల లేచి ఎడంగా పోయింది. అతని కామెవంక చూడటానికి ధైర్యంలేక పోయింది. కాని మొండితనం చేసి ఆమెవంక చూశాడు.

"ఆ గొలుసు లాగితే బండి ఆగుతుంది. లాగు!" అన్నాడు. ఆమె అతని వంక బోనులో సింహంవంక చూస్తున్నట్టు చూస్తూ నిలబడ్డది.

అతను మొహం చేతుల్లో పెట్టుకుని "నాకు మతి చెడిపోయింది. నేను వెనకటి ప్రసాదరావును కాను!" అని గొణుక్కున్నాడు. అయిదునిమిషాలసేపిదదూ కదల్లేదు. ఆ పిల్ల మెల్లిగావచ్చి అతని భుజంమీద మెల్లిగా చెయ్యివేసి "మీరేమీ పశ్చాత్తాప పడక్కర్లేదు. నాకన్న మీకే మోసం ఎక్కువ. మీరు చేసిన పనివల్ల. నేను మిమ్మల్ని బుట్టలో వెయ్యటానికి ప్రయిత్నం చేస్తున్నాను కనుక నాకు కష్టంగా ఉంటుందని మీరనుకోటాని కవకాశంలేదు," అంది.

ప్రసాదరావు తలఎత్తి "నే నెట్లాగూ పెద్దమనిషిని కానని నిరూపించు కున్నాను. నువ్వింతవరకు చాలా పెద్దమనిషి తరహాగా ప్రవర్తిస్తూ వచ్చావు. ఆ ఒక్కమాటతో నన్ను వదిలెయ్యి," అన్నాడు.

ఆ పిల్ల కష్టంగా "క్షమించండి!" అన్నది.

ఆ మాటతో అతని కాపిల్లను చూస్తే చాలా గౌరవం కలిగింది. ఇద్దరి పరిచయం ఇంతవరకు వచ్చిన తరవాత తన మనస్థితంతా ఆమెకు చెప్పేద్దామను కున్నాడు. తన భార్య గోలంతా చెప్పాడు. తన మనస్సు విరిగిపోయిందన్నాడు. లేకపోతే తనట్లా ప్రవర్తించాలిసింది కాదన్నాడు. ఆ పిల్ల అంతా ఓపిగ్గావిని తన కథంతా చెప్పింది.

ఆ పిల్లపేరు కాంతం. ఆమె మేనమామ సంఘసంస్కారి. అనేకమంది భోగంవాళ్ళకు పెళ్ళిళ్ళు చేయించాడు. ఆ పిల్లనాయనే పెంచి చదువు చెప్పించి పెళ్ళికి ప్రయత్నంచేస్తూ చనిపోయినాడు. తరవాత కాంతం తల్లి దగ్గిరకొచ్చింది. తల్లి కూతుర్ని వృత్తిలో దిగమని ప్రోద్బలం చేసింది కూతురు వినలేదు. తల్లి దొంగెత్తువేసి పెళ్ళనే వంకపెట్టి ఒక యెద్దు కంటగట్టింది కాంతాన్ని. కాంతం అయన్ను పెళ్ళి చేసుకోనంది. భోగం పిల్లలను పెళ్ళిచేసుకునేందుకు రంభలు రారని[1] గట్టిగా చెప్పేసింది తల్లి. ఈ పని జరిగిన కొద్దిరోజుల కావేశ్యమాత కూడా చచ్చిపోయింది. ఆ యెద్దు కాంతం తల్లిదగ్గిర ఉన్న సామానంతా అమ్మి "మా ఊరు ఏలూరు, మా యింటికి పోదాం పద" మని ప్రయాణం చేశాడు. ఏలూరుతో

---

1. ఇంద్రుడు రారని ఉండాలేమో!

ఒక సందులో బండి ఆపి ఇక్కడే ఇల్లు దిగమన్నాడు. కాంతం దిగటంతోటే బండి తిరిగి స్టేషను దారిపట్టింది. ఆ యెదుకు దిగినబండే అంది ఉంటుంది. కాంతం రైలుకు దారికనుక్కుని స్టేషను చేరేటప్పటికి రైలుపోయి చాలా సేపయింది. కాంతం భోజనంచేసి పన్నెండుగంటలు దాటింది.

ఇదంతా కాంతం చెబుతానన్నప్పు డతను చెప్పనియ్యకపోవటం మేలే అయింది. అప్పుడైతే అతని కిదికూడా పార్టు ఆఫ్ ది గేమ్ అనిపించేదే. ఇప్పు డతని గుండె నీరయిపోయింది.

"బెజవాడలో మరి నీకెవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"మా స్నేహితులున్నారు. కొంతకాలం వాళ్ళ అండన పడి ఉంటే తరవాత ఏమవుతుందో! మా మామయ్య స్నేహితులున్నారు. వాళ్ళ మొహం ఎట్లా చూడను?"

"నువ్వెప్పటికైనా కులవృత్తి చెయ్యవలిసొస్తుందేమో! నీకిష్టం లేదు కదూ?"

"నిజం చెప్పటంకన్న, నిజమే ఎక్కువ. ఇష్టంలేకపోతే లేదని అనుకోవటం వల్ల ఒరిగేదుందా?"

"లేదు. నువ్వు చాలా అద్భుతమైనదానివి."

"నే ననేదదే! మీరు నిజంగా అట్లా భావిస్తే పైకనరు."

మనిషికి బుద్ధిలేదు అతనికి కాంతాన్ని మళ్ళీ ముద్దు పెట్టుకోవాలనిపించింది. ఈ అనిపించటమైనా తప్పయి ఉండాలి, అంతకుపూర్వమే కలిగిన అతని పశ్చాత్తాపమయినా అర్థంలేనిదయి ఉండాలి. ఎట్లాగైనా అతనికి బుద్ధిలేనట్టే.

"నన్ను మాట్లాడనివ్వవు! రోజూ నీవంటిదానితో సంచరించటం బహు కష్టం!"

"ఇంత అద్భుతమైన దాన్నయినా?"

ప్రసాదరావు కాంతం రెండుచేతులూ పట్టుకున్నాడు.

"ఎక్కడికీ వెళ్ళవద్దు! నాదగ్గిరే ఉండు, కాంతం!"

"ఎవరికోసం ఉండను?"

"నీకిష్టమైతే నాకోసం."

"మీరు నాతో సుఖపడరు!"

"పడతాను."

"లోకం మిమ్మల్ని చెండుకు తింటుంది."

"నేను లెక్క చెయ్యను."

"చేస్తారు! ఎవరో ఒప్పుకోకపోతే మీరు లెక్కచెయ్యక పోవచ్చు మీ అమ్మగారే ఉందనుకోండి."

ప్రసాదరావు నిట్టూర్పు విడిచాడు.

"ఆవిడ ఒప్పుకుంటే మీదగ్గిర ఉంటాను. మీ సుఖం కోసం కాదు నా తిండి కోసంకాదు, మీకోసం ఉంటాను. ఆవిడ ఒప్పుకోకపోతే ఉండను.

## 3

బెజవాడలో ఇద్దరూదిగారు. ఒక బండి ఎక్కారు, ఇద్దరూ పోవలసిందీ ఒక వైపే. మధ్య కాంతం బండిఆపించి దిగింది. ప్రసాదరావు ఇల్లుగుర్తుపెట్టుకున్నాడు.

ఇంట్లో అడుగుపెడుతూనే తల్లితో చెప్పుదామని అతని ఉద్దేశం. కాని తల్లి మొహంచూడగానే అతనికి ధైర్యం లేకపోయింది. అతని సితి కాలుగాలిన పిల్లిలే ఉంది. ఉత్త శరీరసంబంధమయిన అందం మరుపుకొస్తుంది. కాంతాన్ని ఎట్లా మరిచి పోతాడు? తను కాంతం విషయంలో చూపించిన అన్యాయం, నిర్దయ, మోటుతనం! తన అహంకారం? తనలో ఏంచూసి కాంతం తన్ను బుటలో వేసుకోవాలని ప్రయత్నం చేస్తుంది? కాంతం అన్న ఒక్కొక్క మాట గంట మోగినట్టు చెవిలో మోగు తుండెను.[1] తనన్నమాటలు తలుచుకుంటే ప్రాణం చచ్చిపోతుండె! అవి ఇంకా నాలుగైదుసార్లు జ్ఞాపకం వస్తే మర్నాడు కాంతం మొహంచూసే ధైర్యం కూడా ఉండదు తనకు.

సుశీలతో పోల్చినా ఎక్కడి కాంతం, ఎక్కడి సుశీల! కాంతాన్ని చూస్తే ఉన్నగౌరవం తన కింకెవర్నీ చూస్తే లేనప్పుడు ఇంకోళ్ళేమనుకుంటారో. అనే ఆలోచనెందుకొస్తుంది? కాని తల్లి—

అతనికి ఒంటిగంటకుకాని నిద్రపట్టలేదు, మర్నాడు లేచేటప్పటికప్పుడే బాంబుపేలింది. వెంకాయమ్మగారి కప్పుడే రిపోర్టువచ్చింది. ప్రసాదరావు భోగం దానితో రైలుదిగాడని ఓరూ, ఎక్కాడని ఓరూ! వెంకాయమ్మగారు లేవగానే కొడుకును ప్రశ్నించింది. పాచిమొహంతో ఒక్క అబద్ధమైనా ఆడకుండా అతను తల్లికి చెప్పదగినంతవరకు చెప్పాడు.

---

1. భూతకాలికరూపం గ్రాంధికంలో

వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయింది.

"కాంతాన్ని ఇంతప్పుడు చూశానురా అబ్బాయి! వాళ్ళ రామదాసు మీనాన్నకు స్నేహితుడు. జ్ఞాపకం ఉందా? ఎర్రబొట్టు నిలువుగా పెట్టుకుని, తలగుడ్డ చుట్టుకుని, మీసాలూ ఆయనా! మంచివాడు, పాపం! ఆయన పెళ్ళాంతో ఈ పిల్ల ఒకరోజున పేరంటానికొచ్చింది మనింటికి. దాన్ని మళ్ళీ ఒకసారి తీసుకురా," అన్న దావిడ నవ్వుతూ.

"ఇవాళ్ళే తెస్తాను," అన్నాడు ప్రసాదరావు నిశ్చింతగా.

*ముద్రణ: అక్టోబరు 1934, ఆంధ్రభూమి మాసపత్రిక.*